



ఏర్పాట్లను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

మహానాడుకు మించి 'సూపర్‌హిట్' సభ

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి అనంతపురం కలెక్టరేట్

ఈ నెల 10వ తేదీన అనంతపురంలో జరిగే 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' సభను మహానాడుకు మించి నిర్వహించేందుకు కూటమి నేతలందరూ సమన్వయంతో పని చేయాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సూపర్ హిట్ సభ ఏర్పాట్లను ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, ఎంఎస్.రాజు, బండారు శ్రావణి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజుతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ టిడిపి, బిజెపి, జనసేన కలిసికట్టుగా ఎన్నికల ముందు ప్రచారం చేశామని..ప్రజలకు నిర్దిష్టమైన హామీలు ఇచ్చామన్నారు. ఆ హామీల్లో కీలకమైనవాటిని నెరవేర్చామన్నారు. అధికారంలోకి వచ్చిన 14 నెలలలోపే 100శాతం హామీలు నెరవేర్చడం గతంలో ఎప్పుడూ చూడలేదన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ సభ చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉంటుందని స్పష్టం చేశారు. సుమారుగా మూడున్నర లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉందని.. అందుకు తగిన విధంగా ఇక్కడ సభ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

మంత్రుల సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రులు

సూపర్‌హిట్ సభ ఏర్పాట్లపై అనంతపురం ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఆదివారం సాయంత్రం మంత్రులు కలెక్టర్ వినోద్‌కుమార్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. మంత్రులు, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరియు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే దేవినేని ఉమా, సిఎం పర్యటనల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్‌తో పాటు జిల్లా ఎమ్మెల్యేలు, సమీక్ష నిర్వహించారు. బహిరంగ సభ నిర్వహణ, పార్కింగ్, ఇతర ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతపురంలోని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి నివాసంలోనూ టిడిపి ప్రజాప్రతినిధులు, నాయకులు సమావేశమై చంద్రబాబు పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. సూపర్ సక్సెస్ సభను కనీవిని ఎరుగని రీతిలో నిర్వహించి విజయవంతం చేయాలని మంత్రులు సూచించారు.

పార్కింగ్ స్థలాల్లో ఏర్పాట్లను పూర్తి చేయాలి : కలెక్టర్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లా పర్యటన నేపథ్యంలో ఆదివారం నగరంలోని శ్రీనగర్ కాలనీ ఉన్న విజేత మార్ట్ పక్కన, కేశవరెడ్డి స్కూల్, సంఘమిత్ర నగర్ ఎక్సెటెన్షన్, వివిఐపి, విఐపి పార్కింగ్ తదితర 15 ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న పలు పార్కింగ్ స్థలాలలో ఏర్పాట్లను కలెక్టర్ వినోద్ కుమార్ పరిశీలించారు. పార్కింగ్ స్థలాల్లో ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, ఆర్డీవో కేశవ నాయుడు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి

నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక ప్రకటించండి

ముఖ్యమంత్రికి సిపిఎం బహిరంగ లేఖ



జిల్లా సమగ్రాభివృద్ధిపై ముఖ్యమంత్రికి లేఖను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈ నెల 10వ తేదీన జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా సమగ్రాభివృద్ధికి నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలని సిపిఎం జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, వి.రామిరెడ్డి, ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎం.నాగమణి, టి.రామాంజనేయులు ముఖ్యమంత్రికి బహిరంగ లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా నల్లప్ప మాట్లాడుతూ అనంతపురం జిల్లా సమగ్రాభివృద్ధికి ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. హంద్రీనీవా కింద పంట కాలువలు తవ్వి, హెచ్ఎల్‌సి ఆధునీకరణ పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో దళితవాడలకు శ్మశాన స్థలాలు ఏర్పాటు చేయాలన్నారు. ఖనిజ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. రైతులు, వ్యవసాయ కార్మికులు చేతివృత్తిదారులు, కౌలురైతుల సమస్యలు, విద్యా, వైద్యం రంగాలకు నిధులు, సిబ్బంది నియామకం చేయాల్సుందన్నారు. సూపర్ సిక్స్ హామీలు కొన్నింటిని అమలు చేయడం ప్రజలకు ఆనాందాన్ని ఇచ్చినా మిగిలిన హామీలపైనా ఎదురు చూస్తున్నారని చెప్పారు. యువతకు 20లక్షల మంది ఉద్యోగ కల్పన, నిరుద్యోగభృతికి నెలకు రూ.3000 ఇవ్వాలన్నారు. 18 నుంచి 59 సంవత్సరాలలోపు ఉన్న మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్న హామీ అమలు ఊసే లేదన్నారు. వివిధ నిబంధనల కారణంగా తల్లికి వందనం జిల్లాలో ఇంకా 20 లక్షల మందికి విద్యార్థులకు రూ.1346 కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. ఉచిత గ్యాస్ హామీకి సంబంధించి ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఈ సమస్యలపై స్పందించండి : సిపిఎం

- అనంతపురం జిల్లాకు సంబంధించి బొమ్మనహల్ మండలం ఉంతకల్లు రిజర్వాయర్‌కు నిధులు కేటాయించాలి. భైరవానితిప్ప రెజర్వాయర్ నీటి మళ్లింపు పనులను పూర్తి చేయాలి. హంద్రీనీవా కింద లక్షకు పైగా ఎకరాలకు సంబంధించిన పంట భూముల కు సాగునీరు అందించడానికి పంట కాలువలను తవ్వడానికి నిధులు కేటాయించాలి. హెచ్ఎల్‌సి ఆధునీకరణ పనులను పూర్తి చేయాలి. పీఏపీఆర్ రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచాలి. జిల్లాలోని అన్ని చెరువులు, కుంటలకు నీళ్లు ఇవ్వాలి. ఐడిబి మీటింగ్‌ను తక్షణం జరపాలి.
- 2024 సంవత్సరం సంబంధించిన పంటల బీమా నిధులను విడుదల చేయాలి. ఉద్యాన వన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి. శీతల గిడ్డంగులను ఏర్పాటు చేయాలి. జ్యూస్ ప్యాక్టరీలను ఏర్పాటు చేయాలి. ఈ సంవత్సరం ఖరీదులో పంటలు పెట్టని రైతులకు ప్రత్యామ్నాయ పంటలకు విత్తనాలు ఇతర సహకారాలు ఇవ్వాలి. 2024 నుంచి జిల్లాలో అత్మహత్యకు గురైన 84 మంది రైతులకు పరిహారం ఇవ్వాలి. యూరియా కొరతను నివారించాలి. బ్లాక్ మార్కెట్లో అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలి. కౌలు రైతులకు గుర్తింపు, కార్డులు ఇవ్వాలి. దేవాలయ భూములకు సంబంధించిన కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వాలి. జిల్లాలో 48 వేల ఎకరాలకు పైగా సోలార్ విండ్ ఎనర్జీ పరిశ్రమల పేరుతో బలవంతపు భూసేకరణ ఆపి, 2013 భూసేకరణ చట్టం కింద తీసుకోవాలి. ఇప్పటికే సేకరించిన భూములలో పరిశ్రమలు ఏర్పాటు చేయని వాటిని రైతులకు తిరిగి వెనక్కు ఇవ్వాలి.
- గ్రామాలకు స్మశాన స్థలాలు కేటాయించాలి. జిల్లాలో ఉండే 570 గ్రామపంచాయతీలు, గ్రామాలకి శ్మశాన స్థలాల సమస్యను తీర్చాలి. దళితులు ఇప్పటికీ వాగులు, వంకల్లో ఖననం చేస్తున్నారు. ఈ సమస్యను తక్షణం పరిష్కరించాలి. శింగనమల రాచేపల్లి లిడ్ క్యాప్ పరిశ్రమలు పునరుద్ధరించాలి. అన్ని కార్పొరేషన్‌లలో యువతకు రుణాలు, ఉపాధి, శిక్షణ కల్పించాలి.
- జిల్లాలో డోలమైట్, ఇనుప ఖనిజం, గ్రానైట్ నల్లబండలు తదితర ఖనిజాలున్నాయి. వీటి ఆధారంగా పరిశ్రమలను ఏర్పాటు చేయాలి అందుకు నిర్దిష్ట ప్రణాళికను రూపొందించాలి.
- కూటమి ప్రభుత్వం అధికారులకు వచ్చినప్పటి నుంచి ఉపాధి హామీల్లో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరుగుతున్నాయి. వీటిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ఏడాదికి 200 రోజులు పని రోజులు, కూలి రూ.600 రోజుకు ఇవ్వాలి.
- అనంతపురం నగరంలో రేషన్ పక్కదారిని నివారించాలి. నగరంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇల్లు మంజూరు చేయాలి. డంపింగ్ యార్డ్‌ను తరలించాలి. భూగర్భ డ్రెయినేజీ పనులకు నిధులు కేటాయించాలి.
- గ్రామపంచాయతీ, స్వచ్ఛభారత్ ఇతర ప్రభుత్వ సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు ఇతర కార్మికులకు కనీస వేతనం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి. భవన నిర్మాణ కార్మికులకు ఫెడరేషన్ నిధులను ఖర్చు పెట్టాలి.
- అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను పునరుద్ధరించాలి. శింగనమల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైన్స్ గ్రూపులను ఏర్పాటు చేయాలి. పుట్లూరులో నిర్మించిన జూనియర్ కళాశాలను ప్రారంభించాలి.
- అనంతపురం నగరంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ప్రత్యేక నిధులు కేటాయించి, వైద్యులు, పారా మెడికల్ సిబ్బందిని నియమించాలి. అనంతపురము నగరంలోని సర్వజన ఆసుపత్రికి అత్యవసర విభాగాన్ని విస్తరించాలి. మందులు అవసరమైన మేరకు ఉచితంగా ఇవ్వాలి.

వీటిన్నింటిపై అనంతపురం పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి స్పందించి సమగ్రాభివృద్ధిపై నిర్దిష్ట ప్రణాళిక కార్యాచరణ ప్రకటించాలని సిపిఎం జిల్లా కమిటీ కోరింది.

వరి పైరుకు మజ్జిగ తెగులు

ఆందోళనలో రైతులు - అందుబాటులో లేని వ్యవసాయ అధికారులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్



మజ్జిగ తెగులు సోకిన వరి పైరు

మండలంలో తుంగభద్ర ఆయకట్టు కింద సుమారు 10వేల ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. సోనా మసూరి, ఆరున్నర, నెల్లూరు సోనా, టెన్ టెన్, తదితర ఈ వంగడాలను రైతులు విస్తృతంగా సాగు చేశారు. పంటకు మొదటి విడతగా రసాయన ఎరువులు పిచికారి చేశారు. అయితే ప్రస్తుతం సోనా మసూరి రకానికి మజ్జిగ తెగులు సోకింది. అయితే ఈ తెగులు నివారణకు ఏ మందు లు ఎంత మోతాదులో వాడాలి, తదితర సలహాలు, సూచనలు చేసేందుకు వ్యవసాయ శాఖ అధికారు లు అందుబాటులో లేక పోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. విధి లేని పరిస్థితుల్లో పంట పొలాలను మొబైల్‌లో ఫొటోలు తీసుకుని ఎరువుల దుకాణం వద్దకు వెళ్లి ఫొటోలు చూపించి వారి సలహా మేరకు క్రిమిసంహార మందులు పిచికారి చేస్తున్నారు. గ్రామ స్థాయి వ్యవసాయ అధికారులు రైతు సేవా కేంద్రానికే పరిమితం అవుతున్నారని రైతులు పేర్కొంటున్నారు. విత్తనాలు, ఎరువుల పంపిణీ, క్రాప్ బుకింగ్ చేయడం వరకే తమ పని అన్నట్లు వారు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి వరి, మొక్కజొన్న, తదితర పైరులో తెగుళ్ల నివారణకు మందులు సూచించడంతో పాటు దిగుబడి పెంపునకు సలహాలు, సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయ అధికారి సాయికుమార్‌ను వివరణ కోరగా గ్రామాల్లో ఉన్న సిబ్బంది పంట పొలాలకు వెళ్తున్నారని, అక్కడ రైతులకు అవసరమైన సలహాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

రైతులకు అనుకూలంగా మార్కెట్‌యార్డులు

◆ గిట్టుబాటు ధరలకు విక్రయించుకునేలా అవకాశం ◆ జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎంఎల్.నరసింహమూర్తి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్



ఎంఎల్.నరసింహమూర్తి

రైతులు పండించిన తమ ఉత్పత్తులను సమీప మార్కెట్ యార్డులలో దళారుల బెడద లేకుండా విక్రయించుకునేందుకు జిల్లాలో మార్కెట్‌యార్డులు అందుబాటులో ఉన్నాయి. పంటలకు గిట్టుబాటు ధరలు లేక తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోతుంటారు. సరైన మార్కెటింగ్ సదుపాయాలు లేకపోవడం పంట ఉత్పత్తులను దాచుకునే సదుపాయం లేకపోవడం వల్ల అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాంటి రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం మార్కెట్ యార్డులను ఏర్పాటు చేసి పలు సదుపాయాలను అదిస్తోంది'. అని జిల్లా శ్రీసత్యసాయి జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ ఎంఎల్.నరసింహ మూర్తి తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన పలు అంశాలను ప్రస్తావించారు.

ప్రశ్న:- జిల్లాలో ఎన్ని మార్కెట్ యార్డులు ఎక్కడెక్కడ ఉన్నాయి? ఇందులో శీతల గిడ్డంగులు ఉన్నాయా?

ఎడి: జిల్లాలో 8 మార్కెట్ యార్డులు ఉన్నాయి. ధర్మవరం, గోరంట్ల, హిందూపురం, కదిరి, మడకశిర, పెనుకొండ, కొత్తచెరువు, తనకల్లులో ఉన్నాయి. ఇందులో శీతల గిడ్డంగులు ప్రభుత్వపరంగా లేవు. ఎవరైనా ప్రయివేటు వ్యక్తులు శీతల గిడ్డంగులు ఏర్పాటుకు ముందుకు వస్తే వారికి భూమి సదుపాయం కల్పిస్తాం. ఆ గిడ్డంగులలో నిలువచేసే సరుకులకు వారు సుంకం వసూలు చేసుకోవచ్చు. హిందూపురంలో ఆ విధంగా ముందుకు వచ్చి శీతల గిడ్డంగులు కొందరు నిర్మించుకున్నారు.

ప్రశ్న: జిల్లాల్లో మార్కెట్‌యార్డుల నిర్వహణ ఏమిటి.?

ఎడి: జిల్లాలో ధాన్యం నిలువ చేసుకునే గిడ్డంగులు అన్ని ప్రధాన ప్రాంతాల్లోనూ ఉన్నాయి. ఆ గిడ్డంగులలో నామమాత్రపు ఫీజు చెల్లించి ఎన్ని రోజులైనా పంటను నిలువ చేసుకునే అవకాశం ఉంది. పెద్ద మార్కెట్లు కలిగిన పట్టణాల్లో ఉండే మార్కెట్ యార్డుల్లో రోజువారి లేదా వారానికి ఒకసారి రైతులు తమ ఉత్పత్తులను వేలం ద్వారా విక్రయించుకునే అవకాశం ఉంటుంది. వ్యాపారులు వేలం పాటలలో పాల్గొంటారు. దీనివల్ల రైతులు దళారుల బారిన పడకుండా తమ ఉత్పత్తులను విక్రయించుకునే వెసులుబాటు ఉంది.

ప్రశ్న: మార్కెట్‌యార్డులలో ఏఏ సరుకులు విక్రయాలు ఉంటాయి? ఎన్ని గిడ్డంగులు ఉన్నాయి?

ఎడి: ప్రధానంగా వ్యాపార కూడలి అయిన హిందూపురంలో చింతపండు, వట్టి మిరప, సరుకులు క్రయవిక్రయాలు ఉంటాయి. ఇవి గాక రోజువారి వస్తువుల వ్యాపారాలు జరుగుతుంటాయి. గోరంట్ల మార్కెట్ యార్డ్‌లో కదిరి, కొత్తచెరువు యార్డులలో పశువుల వారపు సంతలు జరుగుతాయి. అందులో పశువుల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. ధర్మవరంలో మామిడికాయల సీజన్‌లో ఎక్కువగా ఆ కాయల విక్రయాలు జరుగుతుంటాయి. ఈ యార్డుల్లో 30 వరకు గిడ్డంగులు ఉన్నాయి. ఇవి గాక ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో కూడా గిడ్డంగులు ఉన్నాయి.

ప్రశ్న: మార్కెట్ యార్డుల వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయి? చెక్ పోస్టుల పని విధానం ఏమిటి?

ఎడి : మార్కెట్ యార్డులలో రైతులు తమ పంటల ఉత్పత్తులను నామమాత్రపు ఫీజులతో నిలువ చేసుకోవచ్చు. దళారుల బెడద లేకుండా స్వేచ్ఛగా తమకు నచ్చిన ధరకు సరుకు విక్రయించుకోవచ్చు. జిల్లాలో 12 చెక్‌పోస్టులు ఉన్నాయి. బత్తలపల్లి, రాళ్లఅనంతపురం, గుమ్మయ్యగారి పల్లి, పాలసముద్రం, కొడికొండ, మేళాపురం, కుటాగుల్ల, మడకశిర, పెనుకొండ, కొత్తచెరువు, మహమ్మదాబాద్ క్రాస్, కొక్కంటి క్రాస్ ప్రాంతాలలో చెక్‌పోస్టులు ఉన్నాయి. ఈ చెక్‌పోస్టులలో ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా చట్ట వ్యతిరేకంగా ఇతర రాష్ట్రాలకు వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేసే వాహనాలను తనిఖీ నిర్వహించి, అక్రమంగా తరలిస్తుంటే తగిన చర్యలు తీసుకుంటాం. రైతు వారి ఉత్పత్తులకు సంబంధించి సరైన పత్రాలు చూపించి ఎక్కడైనా విక్రయించుకునే సదుపాయం ఉంది. తన ఉత్పత్తులకు సంబంధించి పాస్ పుస్తకం, వన్ బి తదితర పత్రాలను చెక్కు పోస్టులల్లో అధికారులకు చూపించాల్సి ఉంటుంది.



ప్రశ్న:ఏటా మార్కెట్ యార్డుల ద్వారా ఎంత మొత్తం ఆదాయం ఉంటుంది? అన్నింటికి భవన సముదాయాలు ఉన్నాయా.?

ఎడి: జిల్లాలోని 8 మార్కెట్ యార్డుల ద్వారా సుమారు రూ.5కోట్లు ప్రభుత్వానికి పన్నుల రూపంలో వస్తోంది. చెక్‌పోస్టుల్లో తనిఖీల ద్వారా వచ్చిన డబ్బును మరుసటి రోజే చలానా ద్వారా సిబ్బంది చెల్లించాల్సి ఉంటుంది. కొత్తచెరువు, గోరంట్ల యార్డుల్లో అధికారుల కార్యాలయాల భవనాలు చిన్నగా ఉన్నాయి. వాటిని పెద్దగా నిర్మించాల్సి ఉంది. చాలా యార్డుల్లో సిసి రహదారులు, డ్రెయినేజీ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. వీటిపై ప్రభుత్వానికి నివేదికలు ప్రతిపాదించాం.

ప్రశ్న:మీ శాఖలో సిబ్బంది కొరత ఉందా? రైతులకు మీరు ఇచ్చే సూచనలు, సలహాలు ఏమిటి?

ఎడి: మార్కెట్ యార్డులలో దాదాపు 50 శాతం సిబ్బంది అవసరం అవుతుంది. ఉన్న వారితోనే కొనసాగిస్తున్నాం. ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు ప్రతిపాదించాం. రైతులు తమ ఉత్పత్తులను దళారుల బారిన పడకుండా మార్కెట్ యార్డుల ద్వారా గిట్టుబాటు ధరలకు విక్రయించుకోవచ్చు.

ఆక్రమణలతో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం..!

పొంగిపొర్లుతున్న కాలువలు.. రోడ్లపైకి చేరుతున్న మురుగు

ప్రజాశక్తి-నార్పల

జిల్లాలోనే ప్రశాంతతకు మారుపేరైన నార్పల దినదినాభివద్ధి చెందుతోంది. దీనికి తోడు కార్మికులు, కర్షకులు, వివిధ పనులు చేసుకునే వారికి అనుకూలమైన ప్రాంతం కావడంతో పలు గ్రామాల నుంచి నార్పలకు వచ్చి స్థిరపడే వారి సంఖ్య క్రమేణా పెరిగిపోతోంది. ఈ క్రమంలో పట్టణం విస్తీర్ణం కూడా చాలా వరకూ పెరిగిపోయింది. 20 ఏళ్ల క్రితం జనాభాను దృష్టిలో ఉంచుకొని అప్పటి పాలకులు, అధికారులు వీధుల్లో ఇళ్ల ముందు డ్రెయినేజీ కాలువలు నిర్మించారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొద్దిగ నీరు ఎక్కువ వచ్చినా, చెత్త అడ్డుపడినా డ్రెయినేజీల్లోని మురుగు నీరు రోడ్లపై చేరుతున్నాయి. ఆ సమయంలో పంచాయతీ సిబ్బంది నీటిని తొలగించి సమస్యను తాత్కాలికంగా పరిష్కరిస్తున్నారు. కానీ అధికారులు శాశ్వత పరిష్కారం మాత్రం చూపడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మండల కేంద్రమైన నార్పలలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారవడానికి ప్రధాన కారణం అక్రమ నిర్మాణాలతో పాటు కొందరు కాలువ తీయడానికి అవకాశం లేకుండా పెద్దపెద్ద బండలు వేసి కాలువలను కప్పేయడమే. అలాంటి ప్రాంతాల్లో పంచాయతీ కార్మికులు డ్రెయినేజీ కాలువల్లో చెత్త తీయడానికి ఏమాత్రం వీలు కావడం లేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడంతో తరచూ కాలువలు పొంగి పొర్లి మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. డ్రెయినేజీ కాలువల పక్కన గృహాలు ఉన్న వారిలో 90 శాతానికి పైగా కాలువపై అక్రమ కట్టడాలు కట్టారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు, పాలకవర్గం స్పందించి నార్పలలో డ్రెయినేజీ కాలువలపైన నిర్మించిన అక్రమ కట్టడాలు, పెద్ద బండలను తొలగించాలని, పెరిగిన జనాభా కు అనుగుణంగా కాలువలు వెడల్పు చేసి డ్రెయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.





డ్రెయినేజీలపై అక్రమ నిర్మాణాలతో కాలువల నిండి రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు

ప్రణాళిక ప్రకారం యూరియా పంపిణీ : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



జిల్లాలో పకడ్బందీ ప్రణాళిక ప్రకారం యూరియా పంపిణీ చేపట్టాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఆదివారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి యూరియా పంపిణీపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, మార్క్ ఫెడ్ డిఎం, ఏపీఎమ్ఐపి పీడీతో పాటు మండల స్థాయి వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా పంపిణీకి ప్రణాళిక రూపొందించి, దాని ప్రకారం పకడ్బందీగా పంపిణీ చేయాలన్నారు. యూరియా కోసం జిల్లాలో ఎక్కడా పెద్ద క్యూలైన్ ఉండే పరిస్థితి రాకూడదన్నారు. ఏ మండల రైతులు ఆ మండలంలోనే యూరియా తీసుకునే ఏర్పాటు చేయాలన్నారు. రైతు సేవా కేంద్రాలకు యూరియా పంపిణీ ప్రణాళిక ప్రకారం జరగాలన్నారు. పంట సాగు వివరాలను చూసుకుని ఎంత స్టాక్ అవసరమో ముందుగానే సంబంధిత అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమా మహేశ్వరమ్మ, మార్క్ ఫెడ్ డిఎం పెన్నేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో ఒకేఒక్కడు..!

ఆ కార్యాలయానికి ఎంపిడిఒ ఒక్కరే దిక్కు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

బ్రహ్మసముద్రం మండలాభివృద్ధి కార్యాలయంలో ఎంపిడిఒ ఒకే ఒక్కరు అన్ని విధులను చూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అవసరమైన సిబ్బంది లేకపోవడంతో అన్ని వ్యవహారాలను ఆయనే నిర్వర్తించాల్సి వస్తోంది. ఒకే ఒక్కరు ఉండడం పని ఒత్తిడి కారణంగా ప్రజా సంబంధిత పనుల పరిష్కారంలో జాప్యం నెలకొంటోంది. బ్రహ్మసముద్రం మండలానికి ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా రంగనాయకులు విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న పూర్వపు ఎంపీడీవో నందకిషోర్ జూన్ 15వ తేదీన డిప్యూటేషన్‌పై అనంతపురానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా రంగనాయకులు బాధ్యతలు చేపట్టారు. ఆయన సొంత విధులు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌తో పాటు ఇన్‌ఛార్జి ఎంపీడీవో బాధ్యతలను చూస్తున్నారు. ఈ రెండు పోస్టులే కాకుండా కళ్యాణదుర్గం తాలూకాలోని డిప్యూటీ ఎంపిడిఒ(పిఒపిఆర్‌డి) బాధ్యతలనూ నిర్వహిస్తున్నారు. ఈ అదనపు బాధ్యతలతో ఆయనపై పని ఒత్తిడి పెరిగి ప్రజా సమస్యలన్నీ పెండింగ్‌లో నిలిచిపోతున్నాయి. రీ సర్వే, పి-4 స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ సేవ, డోర్ టు డోర్ వెరిఫికేషన్ తదితర పనులన్నీ ఎంపీడీవో ఆధ్వర్యంలోనే జరగాల్సి ఉంది. సంక్షేమ పథకాల అమలు కూడా ఈ శాఖ నుంచే అమలు జరగాలి. ఇలాంటి సమయంలో ఒకే అధికారి మూడు బాధ్యతలు నిర్వర్తించడంతో ఈ పనులు అనుకున్న లక్ష్యం మేరకు ముందుకు సాగడం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఒక్క అధికారికి ఒక్క విధులను మాత్రమే అప్పజెప్పి ప్రజా సంబంధిత సమస్యల పరిష్కారం వేగవంతం అయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

బుగ్గయ్య చౌదరికి పలువురి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నియోజకవర్గంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి చేసిన సేవలు ఎనలేనివని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం నాడు బుగ్గయ్య చౌదరి జన్మదిన సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతపురం టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎంపీ అంబికా లక్ష్మి నారాయణ, మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్ టిడిపి నాయకులు కార్యకర్తలు ఇందులో పాల్గొన్నారు.

పలు శాఖల్లో ఇన్‌ఛార్జిల పాలన!

అందుబాటులో ఉండని అధికారులు.. ఇబ్బందుల్లో ప్రజలు



పుట్లూరు తహశీల్దార్ కార్యాలయం

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాలకు రెగ్యులర్ అధికారులు లేరు. ఉన్నతాధికారులు ఆయా కార్యాలయాలకు ఇన్‌ఛార్జి అధికారులను నియమించడం, వారు కార్యాలయంలో సరిగా అందుబాటులో లేకపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా మండల రెవెన్యూ కార్యాలయంలో రెగ్యులర్ తహశీల్దార్ లేకపోవడంతో శింగనమల మండల తహశీల్దార్ శేషారెడ్డికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన 15 రోజులకో, 20 రోజులకో ఓసారి కార్యాలయానికి వస్తుంటారు. ఈ క్రమంలో ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థులు తహశీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. దీనికి రైతులు వివిధ సమస్యలపై కార్యాలయానికి రావడం తహశీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ఉసూరుమంటూ తిరిగి వెళ్లిపోతున్నారు. ఇక స్థానిక పోలీస్ స్టేషన్‌లో కూడా రెగ్యులర్ ఎస్ఐ లేకపోవడంతో యల్లనూరు ఎస్ఐ రామాంజనేయరెడ్డిని ఇన్‌ఛార్జి ఎస్ఐగా నియమించారు. యల్లనూరులోనే పరిస్థితులు తీవ్రంగా ఉండడంతో ఆయన మండలానికి ఎప్పుడో ఓ సారి అలా వచ్చి ఇలా వెళ్తున్నారు. దీంతో గ్రామాల్లో పోలీసుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయని ప్రజలు పేర్కొంటు న్నారు. అలాగే ఆరేళ్లుగా రెగ్యులర్ వెటర్నరీ డాక్టర్‌ను నియమించకుండా ఇన్‌ఛార్జి డాక్టర్లనే నియమిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం అయితే పశు వైద్యశాలకు ఇన్‌ఛార్జి ఎవరో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో పశువులు, జీవాలకు ఏవైనా మందులు, సీజనల్ వ్యాధులపై సలహాలు, సూచనల కోసం ఎవరిని సంప్రదించాలో తెలియక వ్యవసాయ, పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత జిల్లా అధికారులు స్పందించి ఆయా శాఖలకు రెగ్యులర్ అధికారులను నియమించాలని మండల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

సకాలంలో బిటిపి ఎత్తిపోతలను పూర్తి చేస్తాం

మాజీ మంత్రి దేవినేని, ప్రభుత్వం విప్ కాలవ



బిటిపి ప్రాజెక్టు వద్ద మీడియాతో మాట్లాడుతున్న ఉమా, కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణీత కాలవ్యవధిలో జీడిపల్లి నుంచి భైరవాణి తిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాల ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తుందని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. వారు ఆదివారం రాష్ట్ర వ్యవసాయ మిషన్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, కొండారెడ్డితో కలిసి భైరవాణి తిప్ప ప్రాజెక్ట్ రిజర్వాయర్‌ను సందర్శించారు. రిజర్వాయర్‌లో 1.5 టిఎంసిల నీరు నిల్వ ఉందని, డిసెంబర్ మొదటి వారంలో ఆయకట్టుకు విడుదల చేస్తామని జలవనరుల శాఖ డీఈఈ గీతాలక్ష్మి, ఏఈ హరీష్ వారి ప్రశ్నలకు సమాధానమిచ్చారు. దేవినేని ఉమా మీడియాతో మాట్లాడుతూ గత టిడిపి పాలనలో కాలవ శ్రీనివాసులుతో పాటు తన చొరవతో అప్పటి సిఎం చంద్రబాబు బిటిపికి రూ. 968 కోట్లు మంజూరు చేయగా 30 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. ఆ తర్వాత వైసిపి ప్రభుత్వం ఈ పథకాన్ని విస్మరించిందన్నారు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు సిఎం అయ్యారని, రాయదుర్గం, కళ్యాణదుర్గం ఎమ్మెల్యేల చొరవతో సకాలంలో ఈ పథకం పూర్తవుతుందని తెలిపారు. రైతులు సంప్రదాయ వ్యవసాయం వీడి అత్యధిక ఆదాయం ఇచ్చే వాణిజ్య, ఉద్యానవన పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు. అందుకు అవసరమైన శాస్త్రవేత్తలు, అధికారులతో రైతులను కాలవ సమావేశపరుస్తారని తెలిపారు.

'సూపర్ హిట్' సభను విజయవంతం చేద్దాం

ఈ నెల 10వ తేదీ అనంతపురంలో తలపెట్టిన 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' సభను విజయ వంతం చేయాలని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీని వాసులు పిలుపునిచ్చారు. బిటిపి వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సమావేశంలో వారు రైతులు, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఉమా మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలు, ఎన్నికల హామీలను ప్రజలకు వివరించేందుకు, విధి విధానాలు తెలిపేందుకే బహిరంగ సభ ఏర్పాటు చేశామన్నారు. ఈ సభకు ప్రజలందరూ పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కాలవ మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి 18 వేల మందికి పైగా తరలించేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారి వెంట పార్టీ పరిశీలకులు కొండారెడ్డి, గుమ్మగట్ట మండల కన్వీనర్ గిరిమల్లప్ప, సర్పంచి విజయలక్ష్మి, నాయకులు కాలవ సన్నన్న, ఆయకట్టు రైతు సంఘం అధ్యక్షుడు నాగరాజు, ఉస్మాన్, రైతులు ఉన్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు : ఎడిఎ



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎడిఎ సత్యనారాయణ

ప్రజాశక్తి-ఉరవకొండ

యూరియాతో పాటు ఎరువుల కొరత సృష్టించినా, అధిక ధరకు అమ్మినా చర్యలు తప్పవని ఎడిఎ సత్యనారాయణ హెచ్చరించారు. ఆయన ఆదివారం విడపనకల్లులోని అమృత ఏజెన్సీస్, జువారి ఫామ్ హబ్ ఎరువుల షాపులను ఏవో పెన్నయ్యతో కలిసి సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అలాగే రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పట్టా పాస్ బుక్, ఆధార్ జిరాక్స్ తీసుకొని రైతుకు ఒకటి లేదా రెండు యూరియా బ్యాగులను ఆయా పంట దశలను బట్టి పంపిణీ చేయాలన్నారు. యూరియాతో పాటు ఇతర ఎరువులను కూడా రైతులకు సక్రమంగా పంపిణీ చేయాలని, అక్రమాలకు పాల్పడితే షాపు లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. అలాగే యూరియా, ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షలను అనుసరించి అవసరం మేరకు పంటలకు ఎరువులు వాడితే నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే కాక తక్కువ ఖర్చుతో పంట ఉత్పత్తులు పొందే అవకాశం ఉంటుందన్నారు.



హెచ్ఎల్‌సి కాలువలో దర్శనమిస్తున్న గణనాథులు

గణనాథులకూ నీటి కరువే..!

ప్రజాశక్తి-నార్పల

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని బొందలవాడ, బి.పప్పూరు గ్రామాల్లో మండపాల్లో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గణనాథులను నీటిలో నిమజ్జ నం చేయాల్సి ఉంది. అయితే ఆయా గ్రామాల సమీపంలోని హెచ్ఎల్‌సి కాలువలో నీరు లేకపోవడంతో అలాగే వదిలేసి వెళ్లిపోయారు. ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురిసి ప్రాజెక్టులన్నీ నిండుకుండను తలపిస్తున్నాయి. అయినా హెచ్ఎల్‌సి కాలువకు నీరు విడుదల చేయలేదు. ఏటా వినాయక చవితి సమయంలో అధికారులు నీరు విడుదల చేయడంతో హెచ్ఎల్‌సి నీరు ప్రవహించేవి. ఈ ఏడాది సెప్టెంబర్ నెల వచ్చినప్పటికీ హెచ్ఎల్‌సి కాలువకు నీరు చేయలేదు. పెనకచర్ల డ్యాంలో నీరు పుష్కలంగా ఉందని, ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే హెచ్ఎల్‌సి కాలుకు నీరు వదిలి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.

'బిటిపి' నిధుల మంజూరు ఉత్తర్వులు చూపండి : గౌని



గౌని ప్రతాపరెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

భైరవాణి తిప్ప ప్రాజెక్టు (బిటిపి)కు జీడిపల్లి నుంచి కృష్ణా జలాల ఎత్తిపోతల పథకం చేపట్టేందుకు రూ. 965 కోట్లు విడుదల చేసినట్లు మంజూరైన ఉత్తర్వులను బహిరంగపరచాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌని ప్రతాపరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 18 కిలోమీటర్లు కాలువలు తవ్వినట్లు, తిరిగి పనులు వేగవంతంగా చేస్తున్నట్లు రాయదుర్గం, కళ్యాణదుర్గం ఎమ్మెల్యేలు ఇటీవల హంగామా సృష్టించడం, పని నేడో రేపో పూర్తవుతుందనే ప్రకటన చేయడం కేవలం రైతులు, ప్రజలను మభ్యపెట్టడమే అన్నారు. వాస్తవంగా నిధులు విడుదల చేసి ఉంటే ఉత్తర్వులను బహిరంగపరచాలన్నారు. ఈ నెల 10వ తేదీ సిఎం చంద్రబాబు అనంతపురం పర్యటనలో ఆయన చేత స్పష్టమైన ప్రకటన విడుదల చేయించాలన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలోనూ డబుల్ ఇంజిన్ సర్కార్ ఉందని గొప్పగా చెప్పుకునే కూటమి ప్రభుత్వం రైతులకు అవసరం మేరకు యూరియా సరఫరా చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. దీంతో రైతులు బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు మాటలతో రైతులు, ప్రజలను మభ్య పెట్టడం మానుకోవాలని ఆయన ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు హితవు పలికారు.

గుత్తిలో చోరీ

గుత్తి : పట్టణంలోని జంగాల కాలనీలోని ఓ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. కాలనీకి చెందిన తాటికొండ రమణ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి వేరు ఊరు వెళ్లారు. ఇది గమనించిన గుర్తు తెలియని దుండగులు తలుపు గడియ తొలగించి లోనికి ప్రవేశించారు. ఓ గదిలోని బీరువాను బద్దలు కొట్టి అందులో ఉంచిన 8 తులాల బంగారు ఆభరణాలు, 45 తులాల వెండి నగలు, రూ. 1.80 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఊరు నుంచి తరిగొచ్చిన రమణ కుటుంబ సభ్యులు చోరీ జరిగినట్లు గ్రహించి ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత

ప్రజాశక్తి-యాడికి

తప్పిపోయిన బాలుడిని పోలీసులు గంటలోపే గుర్తించి తల్లిదండ్రుల చెంతకు చేర్చిన సంఘటన ఆదివారం యాడికిలో చోటు చేసుకుంది. పుట్లూరు మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తమ్మినేని సునీతమ్మ, రామ్మోహన్ దంపతులు తమ ఆరేళ్ల కుమారుడు తమ్మినేని కృష్ణతో కలిసి యాడికి గ్రామానికి వచ్చారు. ఈ క్రమంలో కృష్ణకుమార్ ఆడుకుంటూ గ్రామంలో తప్పిపోయాడు. స్థానిక తిరుణాంపల్లి గ్రామరోడ్డు సమీపంలో ఏడుస్తూ తిరుగుతుండగా అటువైపు వెళ్తున్న ఓ వ్యక్తి గమనించి బాలుడిని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. దీంతో పోలీసులు గంటలోపే బాలుడి తల్లిదండ్రులను గుర్తించి వారికి క్షేమంగా అప్పగించారు.

అవార్డు గ్రహీత డేనియల్‌కు సత్కారం



అవార్డు గ్రహీత డేనియల్‌కు సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-గుత్తి

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డేనియల్‌ను ఆదివారం మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పట్టణానికి చెందిన డేనియల్ యాడికి మండలంలోని రాయలచెరువు జడ్పీ హైస్కూల్ హెచ్ఎంగా పని చేస్తున్నారు. ఆయన ఈ నెల 5వ తేదీ ఉపాధ్యాయ దినోత్సవం రోజున కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ నుంచి అవార్డు అందుకు న్నారు. దీంతో మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ నాయకులు ఆయనకు శాలువా కప్పి, పూలమాలలతో సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శివశంకర్, నాయకులు రవికుమార్, ఓబుళరాజు, న్యాయవాది విజయ భాస్కర్, ఎఎస్ఐ శ్రీనివాసులు, లైన్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేంద్రప్రసాద్, లైన్‌మెన్ శ్రీనివాసులు, ఫకృద్దీన్, ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, సలీం, శివకుమార్, పోతులయ్య, శ్రీధర్‌గౌడ్, శంకరయ్య, ఖాజాబాషా, చిదంబరెడ్డి, రవిచంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.



బాలుడి వైద్యం కోసం నగదు అందజేస్తున్న క్రీడాకారులు

బాలుడి వైద్య ఖర్చులకు సాయం

ప్రజాశక్తి-రాయదుర్గం

అస్వస్థతకు గురై చికిత్సకు అవసరమైన ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్న మండలంలోని కలుగోడు గ్రామానికి చెందిన ఓ బాలుడిని ఆదుకోవాలనే ఉద్దేశంతో ఆదివారం పట్టణంలో ఛారిటీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఫ్రెండ్స్ క్రికెట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆట మైదానంలో రాయదుర్గం క్రికెట్ ప్లేయర్స్ మ్యాచ్ ఆడారు. ఇరు జట్ల ప్లేయర్లందరూ తోచిన సాయం అందించారు. ఈ మ్యాచ్ ద్వారా మొత్తం రూ. 26,100 పోగు చేసి బాలుని కుటుంబ సభ్యులకు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

15న లేబర్ కమిషన్ కార్యాలయం ముట్టడి



కరపత్రాలు విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-పామిడి

కార్మిక సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15వ తేదీ విజయవాడలో తలపెట్టిన రాష్ట్ర లేబర్ కమిషన్ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. అనిమిరెడ్డి మాట్లాడుతూ సంక్షేమ బోర్డును పున:ప్రారంభించి భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, షాషు, ముత్యాలు, నల్లప్ప, లక్ష్మణ్‌కుమార్, మాబు, చాంద్‌బాషా, తదితరులు హాజరయ్యారు.


శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురం : వారాంతపు సెలవు సందర్భంగా ఆదివారం నగర శివారులోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శిల్పారామంలో 'శక్తి శారీ బ్యాగ్స్' యాజమాన్యం సహకారంతో సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకూ ఓం సంగీత నృత్య కోలాట శిక్షణ సంస్థ వాణి డ్యాన్స్ అకాడమీ సభ్యుల శాస్త్రీయ, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు.



కళాకారిణుల కోలాటం

కళాకారునికి సన్మానం



నారాయణస్వామిని సన్మానిస్తున్న కళాకారులు

ప్రజాశక్తి-నార్పల

మండలంలోని బి.పప్పూరు గ్రామానికి చెందిన సీనియర్ కళాకారుడు, జ్యోతిష్య పండితులు, హార్మోనిస్టు మాల్యవంతం నారాయణస్వామిని ఆదివారం తేనె తెలుగు కల్చరల్ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు అంజనప్ప, గౌరవాధ్యక్షులు డాక్టర్ సామవేదం బాలసుబ్రమణ్యం, కళాభిషేకం డైరెక్టర్ పెద్దరికం సాయి, కార్యదర్శి బొగ్గు రవి ఘనంగా సన్మానించారు. బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సీనియర్ కళాకారులని సన్మానించడం మన బాధ్యత అన్నారు. 24వ కళాభిషేకం ద్వారా నారాయణ స్వామి కళా ప్రస్థానం, ప్రతిభను ప్రపంచానికి తెలిజేశామని అంజనప్ప తెలిపారు. నారాయణ స్వామి కుమారులు చెన్నకేశవులు, రవీంద్ర కూడా ట్రస్ట్ అధినేత, బళ్లారి రాఘవ జాతీయ అవార్డు గ్రహీత అంజనప్ప, బాలసుబ్రహ్మణ్యంను దుశ్శాలువాతో సన్మానించారు. అలాగే కళాకారుల కోసం 24 జ్ఞాపికలు అందజేశారు.

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు



పల్లా శ్రీనివాసరావుని కలిసిన సత్తి

ప్రజాశక్తి-శింగనమల

ఈ నెల 10వ తేదీ 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' సభ నేపథ్యంలో అనంతపురం వచ్చిన టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుని ఆదివారం మండల టిడిపి నాయకులు, స్టోర్ డీలర్ కూరగాయల సత్తి, మాసూల ప్రకాష్ నగరంలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో మర్యాద పూర్వకగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వారు మండలంలో స్టోర్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్య లను ఆయనకు వివరించి, రాష్ట్ర వ్యాప్తంగా స్టోర్ డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. స్పందించిన ఆయన మీ సమస్యలను సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

'మే ఐ హెల్ప్ యు' ఫౌండేషన్‌కు వితరణ

ప్రజాశక్తి-యాడికి

యాడికిలోని 'మే ఐ హెల్ప్ యు' ఫౌండేషన్‌కు ఫౌండేషన్ సభ్యుడైన నిచ్చరమెట్ల చంద్రశేఖర్ రూ. 8వేల సొంత ఖర్చుతో స్టీల్ పైపులతో పాడెను తయారు చేయించి ఆదివారం ఫౌండేషన్‌కు అందజేశారు. ఎవరైనా మృతి చెందితే యాడికి మండలంలోని వారు ఎవరైనా ఈ పాడెను ఉచితంగా తీసుకు వెళ్లవచ్చన్నారు. పాడె కావాల్సిన వారు 99120 99782, 86868 08333 సంప్రదించాలన్నారు.

సిఎం చంద్రబాబు సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-యాడికి

అనంతపురంలో ఈ నెల 10వ తేదీ నిర్వహిస్తున్న 'సూపర్‌సిక్స్-సూపర్ హిట్' సభకు మండలం నుంచి కూటమి శ్రేణులు పెద్దఎత్తున తరలి వెళ్లి విజయవంతం చేయాలని టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ బహిరంగ సభలో కూటమి ఎమ్మెల్యేలందరూ పాల్గొంటారన్నారు. సిఎం చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబడి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు.

శింగనమల : కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు, ఎన్నికల హామీలను దిగ్విజయంగా అమలు చేసిన నేపథ్యంలో ఈ నెల 10వ తేదీ అనంతపురం నగరం శివారులోని జిఎంఆర్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని జనసేనపార్టీ మండల అధ్యక్షులు తోట ఓబులేసు, యువ నాయకులు తోట రామ్మోహన్ పిలుపు నిచ్చారు. ఆయన మాట్లాడుతూ ఆ సభకు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌తో పాటు మంత్రులు, కూటమి ఎమ్మెల్యేలందరూ హాజరవుతారన్నారు. కావున మండల వ్యాప్తంగా కూటమి శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లి జయప్రదం చేయాలని కోరారు.

యూరియా వాడకంపై రైతులకు అవగాహన



యూరియా పంపిణీలో పాల్గొన్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి-రాప్తాడు

మండలంలోని ప్రసన్నాయపల్లి గ్రామంలో ఆదివారం యూరియా వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంటల వారీగా అధికారుల సిఫారసు మేరకు మాత్రమే యూరియా వాడాలన్నారు. యూరియాను తక్కువ మోతాదులో ఎక్కువ దఫాలుగా వాడాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో నేలలో యూరియా వేసే అవకాశం లేనప్పుడు 2 శాతం యూరియా ద్రావణం పిచికారి చేయాలన్నారు. అలాగే కలుపు తీత, తదితర అంశాలను వివరించారు. భూసార పరీక్షలకు అనుగుణంగా అవసరం మేరకు ఎరువులు వాడాలన్నారు. తద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవటమే కాకుండా తక్కువ ఖర్చుతో పంట ఉత్పత్తులు పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎస్.కృష్ణచైతన్య, ఎఇఒ సుజిత, ఆర్ఎస్‌కె ఇన్‌ఛార్జి సోనియా, రైతులు పాల్గొన్నారు.

సిఎం సభకు వేలాదిగా తరలిరండి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

అనంతపురంలో ఈ నెల 10వ తేదీ సిఎం చంద్రబాబు పాల్గొనే 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' సభకు మండల వ్యాప్తంగా ప్రజలు వేలాదిగా తరలి వెళ్లి జయప్రదం చేయాలనిఎంపిడిఒ రంగనాయకులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 80 బస్సులు ఏర్పాటు చేశామని, జన సమీకరణకు ఓ ప్రభుత్వ ఉద్యోగి, ఓ ప్రయివేటు ఉద్యోగిని నియమించామన్నారు. ఇదే అంశంపై సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జన సమీకరణకు ఉపాధి హామీ ఏపీవో, ఫీల్డ్ అసిస్టెంట్లు, వెలుగు ఎపిఎం, యానిమేటర్లు సహకరించాలని కోరారు.

రాయితీపై జిప్సం : ఏవో

ప్రజాశక్తి-శింగనమల

మండల వ్యాప్తంగా పంటలు సాగు చేసిన రైతులకు 4 బస్తాల చొప్పున రాయితీపై జిప్సం పంపిణీ చేస్తామని మండల వ్యవసాయ అధికారి అన్వేష్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి 30(600బ్యాగులు) మెట్రిక్ టన్నుల జిప్సం 28.6 శాతం రాయితీపై సరఫరా అయిందన్నారు. బస్తా(50 కిలోలు) పూర్తి ధర రూ. 262.2 కాగా రాయితీ రూ. 75 పోనూ రైతు రైతు రూ. 187.2 చెల్లించాలన్నారు. అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, మొబైల్ నంబర్ తీసుకొని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

రేపు వైసిపి ఆధ్వర్యంలో 'అన్నదాత పోరు'



రాయదుర్గంలో వైసిపి 'అన్నదాత పోరు' పోస్టర్ విడుదల చేస్తున్న మెట్టు, నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రైతులకు అండగా వైసిపి ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ చేపట్టనున్న 'అన్నదాత పోరు' పోస్టర్లను ఆదివార పట్టణంలోని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి మెట్టు గోవిందరెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. మెట్టు మాట్లాడుతూ జిల్లాలో గత ఖరీఫ్, రబీలో వర్షాభావ పరిస్థితులతో పంటలన్నీ దెబ్బతిని, పెట్టుబడి కూడా దక్కక రైతులు నష్టపోయినా కూటమి ప్రభుత్వం ఆదుకోలేదన్నారు. ఫలితంగా రైతులు రోడ్డెక్కే పరిస్థితి వచ్చిందన్నారు. గతేడాది కంటే ఎక్కువ యూరియా పంపించామని చెబుతున్నా ఇంకా యూరియా కొరత వేధిస్తోందన్నారు. రైతుల సమస్యలపై మంగళవారం కళ్యాణదుర్గంలో వాల్మీకి సర్కిల్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు, మండల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని వైసిపి కార్యాలయంలో నాయకులు గోళ్ల సూర్యనారాయణ, ఐ.సుధీర్‌బాబు, హనుమంతరాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, గొల్ల హనుమంతరాయుడుఆధ్వర్యంలో 'అన్నదాత పోరు' పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రాజ్ కుమార్, కో ఆప్షన్ మెంబర్ మమతా సురేష్, షెక్షావలి, ఎంపిపి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు పాతలింగ, తిప్పేస్వామి, రామాంజనేయులు, జాని, చరణ్, మంజు, అంజి, అతావుల్లా, విద్యార్థిసంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉరవకొండ : రైతాంగం సమస్యలపై వైసిపి ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ గుంతకల్లులో చేపట్ట నున్న 'అన్నదాత పోరు' నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ ఆ పార్టీ జిల్లా నాయకులు రాకెట్ల అశోక్ కుమార్, వీరన్న, మోపిడి సర్పంచి సిద్ధప్ప కోరారు. ఈ మేరకు స్థానిక పార్టీ కార్యాల యంలో నాయకులు 'అన్నదాత పోరు' పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు నరసింహులు, కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, ఎర్రిస్వామి, ఈడిగ ప్రసాద్, బసవరాజు, వేమన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

శింగనమల : శింగనమలలో సింగిల్‌విండో మాజీ ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామ్‌రెడ్డి ఆధ్వర్యంలో 'అన్నదాత పోరు' పోస్టర్‌ను విడుదల చేశారు. అంతకుముందు మాజీ సిఎం వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నారాయణరెడ్డి, శ్రీరామరెడ్డి, పూల ప్రసాద్, ఎల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఖాదర్‌వలి, మహేష్‌రెడ్డి, చాగంటి గురుమూర్తిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, అలీబాషా, దాసరి వెంకటరమణ, వరకూటి కాటమయ్య, ఎన్‌వి.నారాయణ, శివమ్మ, ఆదినారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

స్థానిక జడ్పీ హైస్కూల్‌లో 1996-97 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమావేశమయ్యారు. సుమారు 28 ఏళ్ల తర్వాత బాల్య స్నేహితు లతో కలిసి రోజంతా సంతోషంగా గడిపారు. ఒకరి నొకరు యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ఆనాటి చిలిపి చేష్టలు, మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వయసును మరచి పోయి చిన్నపిల్లలుగా మారిపోయి తాము చదువుకున్న తరగతి గదుల్లో కాసేపు గడిపారు. క్రీడా మైదానంలో ఆడుకున్నారు. పాఠశాలకు తమ వంతు సాయం చేస్తామని హెచ్ఎం ఖాదర్ మోహిద్దీన్‌కు తెలిపారు. అందరినీ పిలి పించి ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేసినందుకు హరీష్‌కుమార్‌రెడ్డిని అందరూ అభినందించారు.



సమావేశమైన 1996-97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు